


# ఉందిలే మంచికాలం..!

అదృష్టమంటే బెంగళూరు భామ నిధి అగర్వాల్‌దే అంటున్నారు అభిమానులు. కెరీర్ ఆరంభంలో వరుస సినిమాలు చేసిన ఈ భామ ఒక్కసారిగా రేసులో వెనకబడిపోయింది. మూడేళ్ల పాటు తెలుగులో సినిమాలకు దూరమైంది. అయినా ఎక్కడా నిరాశపడకుండా మంచి అవకాశాల కోసం ఎదురుచూసింది. ఏకంగా పవన్‌కల్యాణ్, ప్రభాస్ వంటి అగ్ర హీరోల సినిమా ఛాన్స్‌లు కొట్టేసింది. ప్రస్తుతం ఈ అమ్మడు 'హరిహర వీరమల్లు', 'రాజా సాబ్' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది. తాను కావాలని తెలుగులో గ్యాప్ తీసుకోలేదని, అనుకోని కారణాల వల్ల వచ్చిందని, రాబోవు రోజుల్లో మంచి విజయాలను సొంతం చేసుకుంటానని ధీమా వ్యక్తం చేసింది. 'లాక్‌డౌన్‌కు ముందే 'హరిహర వీరమల్లు' సినిమాకు సైన్ చేశా. ఈ సినిమా పూర్తయ్యే వరకు ఇతర చిత్రాల్లో నటించొద్దని వారి టీమ్ నాతో కాంట్రాక్ట్ కుదుర్చుకుంది. ఇంతలో కరోనా రావడంతో మూడున్నరేళ్లు గడచిపోయాయి. 'ది రాజాసాబ్'లో అవకాశం వచ్చినప్పుడు 'హరిహర వీరమల్లు' టీమ్‌ను సంప్రదించాను. సినిమా ఛాన్స్ గురించి చెప్పగా.. వారు వెంటనే అంగీకరించారు. అలా రెండు భారీ ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యా. ఈ రెండు సినిమాలు నాకు విజయంతో పాటు మంచి పేరు తీసుకొస్తాయనే నమ్మకం ఉంది. భవిష్యత్తులో అన్నీ మంచి రోజులే అనే విశ్వాసంతో ఉన్నా' అని నిధి అగర్వాల్ చెప్పింది.



# ఘాటీలో గెస్ట్‌గా?

అనుష్క ప్రధాన పాత్రలో దర్శకుడు క్రిష్ తెరకెక్కిస్తున్న ఫిమేల్ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా 'ఘాటీ'. ఫస్ట్‌ఫ్రేమ్స్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై రాజీవ్‌రెడ్డి, జాగర్లమూడి సాయిబాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే నిర్మాణం 80శాతం పూర్తయింది. ఏప్రిల్ 18న సినిమా విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఈ సినిమాలో ఓ అతిథి పాత్ర ఉందట. ఆ పాత్రలో ఓ హీరో నటిస్తున్నట్టు గతంలో వార్తలొచ్చాయి. కాగా, తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఆ పాత్రను రానా పోషిస్తున్నారని వినికిడి. మరి ఈ వార్తలో ఎంతవరకు నిజం ఉందో చూడాలి. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాను మాటలు రాస్తున్న విషయం తెలిసిందే.



# మా ప్రయాణంలో మరో ఘనత

''ఆర్‌ఆర్‌ఆర్' సమయంలో సినిమాను డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు జర్మనీ వరకు వెళ్లాల్సివచ్చింది. మనదేశంలో ఆ సదుపాయం లేకపోవడం నిరుత్సాహపరచింది. కానీ ఈ రోజు అన్నపూర్ణ స్టూడియోలో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి థ్రిల్ అయ్యాను' అన్నారు ప్రముఖ దర్శకుడు రాజమౌళి. ఇటీవల హైదరాబాద్‌లో అన్నపూర్ణ స్టూడియోలో భారతదేశంలోనే మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్స్ ఫెసిలిటీ యూనిట్‌ను రాజమౌళి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..డాల్బీ విజన్‌లో సినిమాను చూడటం సరికొత్త అనుభవమని, ప్రతి ఫ్రేమ్‌లో స్పష్టతతో కథను మరో స్థాయికి తీసకెళ్తుందని అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ ఛైర్మన్, అగ్ర హీరో నాగార్జున మాట్లాడుతూ 'అన్నపూర్ణ స్టూడియోస్ 50వ వసంతంలోకి అడుగుపెడుతున్న ఈ సందర్భంలో ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. వర్చువల్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతో ఇన్నోవేటివ్ ఆలోచనలతో ఈ ఫెసిలిటీని ఏర్పాటు చేశాం. ఇది మా ప్రయాణంలో మరో ఘనత' అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ స్టూడియోస్ ఎగ్జిక్యూటివ్ సుప్రియా యార్లగడ్డ తదితరులు పాల్గొన్నారు.



# సెకండ్ ఇన్నింగ్స్‌లో కొత్త బాలకృష్ణను చూస్తారు

''ఆదిత్య 369'లోని శ్రీకృష్ణదేవరాయలు పాత్ర వేసిన మారువేషం నుంచి 'డాకు మహారాజ్' పుట్టింది. బాబీ అద్భుతమైన కథ తయారు చేశాడు. ఈ సినిమాకు పనిచేసిన అందరూ మనసుపెట్టి పనిచేశారు. అందరూ కెరీర్ కాస్త నెమ్మదించాక సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెడతారు. నేను సక్సెస్‌లో ఉండే మొదలుపెట్టాను. ఇక నుంచి కొత్త బాలకృష్ణను చూస్తారు. సంక్రాంతికి నేను చేసిన సినిమాలన్నీ దాదాపుగా విజయం సాధించాయి. ఆ సెంటిమెంట్‌ను ఈ సినిమాకూడా కొనసాగిస్తుందన్న నమ్మకంతోఉన్నా.'' అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన చిత్రం 'డాకు మహారాజ్'. సంక్రాంతి కానుకగా ఈ నెల 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో బాలకృష్ణ మాట్లాడారు. 'బాలకృష్ణగారితో పనిచేస్తే ఆయన మాయలో పడిపోతాం. ఆయన ఫాలోవర్ అయిపోతాం. ఇంకొన్ని గంటల్లో సినిమా విడుదలవ్వబోతున్నది. ఇప్పటికీ పనిచేస్తూనే ఉన్నా. విజయ్ కార్తీక్ కెమెరా సినిమాకు హైలైట్. నా కెరీర్‌లో బెస్ట్ విజువల్స్ ఇచ్చారు.' అని డైరెక్టర్ బాబీ చెప్పారు. ఏ సినిమాలోనైనా కొన్ని సీన్స్ హైలైట్‌గా ఉంటాయని, ఈ సినిమా అంతా హైలైట్‌గానే ఉంటుందని నందమూరి తేజస్విని పేర్కొన్నారు. 'బాబీ తయారు చేసిన 'డాకు మహారాజ్' వరల్డ్ చాలా గొప్పది. 'అఖండ' తర్వాత బాలకృష్ణ అంత కష్టపడి చేసిన సినిమా ఇది. బాలకృష్ణగారు, నేను కలిసి పనిచేసిన సినిమా కాబట్టి, సౌండ్ బాక్స్‌లు బద్దలవ్వడం కామన్. మీరే జాగ్రత్త పడాలి. మాకైతే సంబంధం లేదు.' అని తమన్ అన్నారు. ఇంకా నిర్మాత సూర్యదేవర నాగవంశీ, కథానాయికలు శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్య జైస్వాల్, ఊర్వశి రౌతేలా, డీవోపీ విజయ్ కార్తీక్ కన్నన్ తదితర యూనిట్ సభ్యులతోపాటు బాలకృష్ణ అల్లుడు, వైజాగ్ ఎంపీ భరత్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

# ఈ సినిమాతో మా బాండింగ్ డబులైంది

**రాజమౌళి తర్వాత వందశాతం సక్సెస్ రేట్ ఉన్న దర్శకుడెవరంటే టక్కున వచ్చే సమాధానం అనిల్ రావిపూడి. ఏడాదిన్నర క్రితం 'భగవంత్‌కేసరి'తో బాక్సాఫీస్‌ని షేక్ చేసిన ఈ యంగ్ డైరెక్టర్.. 'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ అసలు సిసలైన సంక్రాంతి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. వెంకటేశ్ హీరోగా దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరులతో ముచ్చటించారు అనిల్ రావిపూడి.**

- వెంకటేష్‌గారితో చేసిన 'ఎఫ్ 2' పొంగల్‌కి వచ్చి పెద్ద హిట్ అయ్యింది. 'ఎఫ్3' కూడా పొంగల్‌కే తేవాలనుకున్నాం. కానీ కుదర్లేదు. ఈసారి చేసే సినిమా తప్పకుండా సంక్రాంతికే తీసుకురావాలని ఓపెనింగ్ రోజునే ఫిక్స్ అయ్యాం. ఓ రెస్క్యూ ఆపరేషన్‌కి సంబంధించిన కథ ఇది. సెకండాఫ్‌లో నాలుగురోజుల ప్రయాణం సాగించిన ఈ కథ.. సరిగ్గా సంక్రాంతి ముందు ల్యాండ్ అవుతుంది. అందుకే 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్ కరెక్ట్ అని కథ అనుకున్నప్పుడే ఫిక్స్ అయ్యాం.
- సినిమా తీయడం కంటే.. సినిమాను జనాలకు చేర్చడమే ఇప్పుడు మేకర్స్‌కి పెద్ద టాస్క్. కోవిడ్ తర్వాత సినిమా సినారియో మారింది. అందుకే.. ప్రమోషన్స్ కాస్త గట్టిగానే చేశాం. వెంకటేష్ బాగా సహకరించారు. రమణగోగుల పాడిన 'గోదారి గట్టు' పాట కూడా ప్రమోషన్స్‌కి బాగా హెల్ప్ అయ్యింది. 85 మిలియన్స్ వ్యూస్‌ని క్రాస్ చేసి గ్లోబల్ సాంగ్‌గా నిలిచింది. వెంకటేష్‌గారు పాడిన పొంగల్ సాంగ్ కూడా అందరికీ నచ్చింది. మొత్తంగా భీమ్స్ మెమరబుల్ ఆల్బమ్ ఇచ్చాడు. దిల్‌రాజు, శిరీష్‌గార్లతో నాది పదేళ్ల ప్రయాణం. వాళ్లతో బాగా కనెక్టయిపోయా. అందుకే వాళ్లతో జర్నీ చేయడానికి ఇష్టపడతా.
- ఐశ్వర్య రాజేష్ కేరక్టర్ పేరు భాగ్యం. గోదారి అమ్మాయి. ఆ యాస, ఆ బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటుందో చూసుకునేందుకు చిన్న ఆడిషన్ చేశాం. ఐశ్వర్య రాజేష్‌కి మంచి పేరు తెస్తుందీ సినిమా. అలాగే మీనాక్షి చౌదరి కూడా బాగా చేసింది. ఇక వెంకటేశ్‌గారితో ఎఫ్ 2, ఎఫ్ 3 తర్వాత చేసిన సినిమా ఇది. ఈ సినిమాతో మా బాండింగ్ డబుల్ అయ్యింది. ఈ సారి వెంకీగారితో డిఫరెంట్‌గా జోనర్ ట్రై చేశాను. వెంకటేష్ గారితో యాక్షన్ సినిమా చేసినా.. వినోదానికే పెద్దపీట వేస్తా. ఓ భార్య, ఓ మాజీ ప్రేయసి మధ్య నలిగే ఓ భర్త కథ ఇది. ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునేలా, రెండు గంటలపాటు ఆడియన్స్ హాయిగా నవ్వుకునేలా సినిమా ఉంటుందని కాన్ఫిడెంట్‌గా చెబుతున్నా. త్వరలో 'ఎఫ్ 4' కూడా ఉంటుంది. 'సంక్రాంతికి వస్తున్నాం'కి కూడా ఫ్రాంచైజీ స్కోప్ ఉంది.



# ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'హత్య'




ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవివర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హత్య'. శ్రీవిద్య బసవ దర్శకురాలు. మహాకాళ్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ప్రశాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల టీజర్‌ను విడుదల చేశారు. దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ 'అందరికి తెలిసిన కథే అయినప్పటికీ గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో ఆద్యంతం ఉత్కంఠ కలిగించేలా సినిమాను తెరకెక్కించాం. సాంకేతికంగా ప్రతి అంశంలో మంచి క్వాలిటీ కనిపిస్తుంది. నరేష్ అందించిన బీజీఎమ్, అభిరాజ్ విజువల్స్ హైలైట్‌గా నిలుస్తాయి' అని చెప్పారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుందని, ఇందులో చాలెంజింగ్ రోల్ చేశానని నటుడు రవివర్మ తెలిపారు. కథాగమనంలో తన పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని పూజా రామచంద్రన్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభిరాజ్ రాజేంద్రన్ నాయర్, సంగీతం: నరేష్ కుమారన్, రచన-దర్శకత్వం: శ్రీవిద్య బసవ.

# ప్రభుత్వం మాట తప్పింది



పెద్ద సినిమాలకు టికెట్ రేట్లు పెంచమని చెప్పిన తెలంగాణ ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ జేవీఆర్. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. పెద్ద సినిమాలకు టికెట్ రేట్లు పెంచడం వల్ల చిన్న చిత్రాలకు అన్యాయం జరుగుతున్నదని, థియేటర్స్‌కు రావాలంటే ప్రేక్షకులు భయపడే పరిస్థితి ఏర్పడుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సినీ పరిశ్రమతో జరిగిన చర్చల్లో తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో పాటు సీనియర్ నిర్మాత రామకృష్ణ గౌడ్‌క ఆహ్వానం లేకపోవడం బాధాకరమని జేవీఆర్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'టికెట్ రేట్లు పెంచడం వల్ల ప్రభుత్వం మాట తప్పిందనే విషయంలో ప్రజల్లోకి వెళ్లింది. ప్రభుత్వం ఇప్పటికైనా మాట మీద నిలబడాలి. టీఎఫ్‌సీసీలో 35 వేల మంది కార్మికులు, 16 వేల మంది సభ్యులున్నారు. ప్రతాని రామకృష్ణగౌడ్‌కు నిర్మాతగా సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన్ని ప్రభుత్వం సినీ పరిశ్రమతో జరిగిన చర్చల్లో పిలవకపోవడం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం టీఎఫ్‌సీసీని గుర్తించి ప్రాధాన్యం ఇవ్వాలి' అన్నారు.






# ఒక పథకం ప్రకారం

హీరో సాయిరామ్‌శంకర్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్‌కుమార్ విజయన్ దర్శకుడు. వినోద్‌కుమార్ విజయన్, గార్లపాటి రమేష్ నిర్మాతలు. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని వచ్చే నెల 7న విడుదల చేయనున్నారు. ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'ఓ మంచివాడి లోపల ఓ చెడ్డవాడు ఉంటాడు.. ఓ చెడ్డవాడి లోపల చెడ్డవాడు మాత్రమే ఉంటాడు..' అనే వాయిస్ ఓవర్‌తో ఈ ట్రైలర్ మొదలైంది. క్రైమ్, మర్డర్ కథనాలను చూపిస్తూ హీరోనే విలనా? అనే సందేహంతో ఈ ట్రైలర్ ముగిసింది. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక భిన్నమైన కథ. ఇందులో అడ్వకేట్‌గా సాయిరామ్‌శంకర్ నటిస్తుండగా, పోలీసు పాత్రలో సముద్రఖని కనిపిస్తారు. ఇద్దరి నటనా పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో ఉత్కంఠను కలిగించే క్రైమ్ మిస్టర్ ఇది' అని తెలిపారు. శ్రుతి సోధి, ఆశిమ నర్వాల్, రవి, భానుశ్రీ, గార్లపాటి కల్పలత, పల్లవి గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజీవ్ రవి, సంగీతం: రాహుల్ రాజ్, నేపథ్య సంగీతం: గోపీసుందర్,

# ప్రేమలో ఆనందమాయే..



హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆనందమానందమాయే'. ఆర్.వి.ఎస్.నిఖిల్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని వేగవంతం చేశారు. ఇటీవల 'ఆనందమాయే..' అనే గీతాన్ని విడుదల చేశారు. శాండిల్య పీసపాటి స్వరపరచిన ఈ పాటను శ్రీసాయి కిరణ్ రచించగా, మనీషా ఈరబత్తిని, యశ్వంత్ నాగ్ అలపించారు. భిన్న వ్యక్తిత్వాలు కలిగిన నాయకానాయికల మధ్య ప్రేమను ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. వినసొంపైన బాణీతో హృదయానికి హత్తుకునేలా పాటను రూపొందించామని మేకర్స్ తెలిపారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మితేష్ పర్వతనేని, సంగీతం: శాండిల్య, రచన-దర్శకత్వం: ఆర్‌వీఎస్ నిఖిల్.



# నల జిలకర మొగ్గ..

ప్రముఖ బుర్రకథ కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్ 'గరివిడి లక్ష్మి'. టైటిల్‌రోల్ ఆనంది పోషిస్తున్నది. గౌరీ నాయుడు జమ్ము దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవలే ఏపీలోని ఆదోనిలో ఈ సినిమా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. రెగ్యులర్ షూటింగ్ మొదలుకాక ముందే విభిన్నంగా సినిమా ప్రమోషన్స్‌ని మేకర్స్ స్టార్ట్ చేశారు. ఇందులో భాగంగా గరివిడి లక్ష్మి వల్ల విశేష ప్రాచుర్యం పొందిన 'నల జిలకర మొగ్గ..' అనే జానపద గేయాన్ని మేకర్స్ విడుదల చేశారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలోని ఈ పాట అక్కడి సంస్కృతికి, జానపద సంప్రదాయానికీ దర్పణంగా నిలిచిందని, ఉత్తరాంధ్ర సాంస్కృతిక చరిత్రలో గరివిడి లక్ష్మికి శాశ్వత స్థానాన్ని ఈ పాట సంపాదించిపెట్టిందని, యువతిలోని గంభీరత్వాన్ని తెలుపుతూ, శక్తివంతమైన సందేశాన్ని ఈ పాట అందించిందని, అక్కడి జనం తరతరాలుగా ఇష్టపడుతున్న క్లాసిక్ ఈ జానపదమని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని వారు అన్నారు. నరేష్, రాశి, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జె.ఆదిత్య, సంగీతం: చరణ్ అర్జున్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాణం: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ.